వానలో వెళ్లేదెలా?

వర్షం కురిస్తే అంతే సంగతులు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మెట్టుగూడ అలుగడ్డబావి ఆర్‌యూబీ వరద నీటితో నిండి పోయింది. ఫలితంగా సికింద్రాబాద్–తార్నాక మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు నేతృత్వంలో రంగంలోని దిగిన ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించారు. భారీగా వాహనాలు స్తంభించిపోయిన పరిస్థితిని సిటీ (ట్రాఫిక్) పోలీస్ డీసీపీ2 ఏ.శ్రీనివాస్ సందర్శించి పరిస్థితిని హైడ్రా అధికారుల దృష్టికి తేవడంతో హైడ్రా బృందాలు రంగంలోకి దిగి వంతెన మార్గాల్లో నిలిచిపోయిన వరద నీటిని బయటకు తరలించడంతో కథ సుఖాంతం అయింది. ఇది ఒక్క అలుగడ్డబావి ప్రాంత సమస్య కానేకాదు. వర్షాలు కురిసిన ప్రతీ సందర్భంలో సికింద్రాబాద్ మార్గాల గుండే వాహనదారులకు ఇబ్బందులు తప్పనిసరవుతున్నాయి. – సికింద్రాబాద్



ఆర్ట్స్ కళాశాల–ఓయూ వంతెన మార్గంలో నిండిపోయిన వరద నీరు

- గోదారులవుతున్న రైల్వే వంతెనలు
- వరదకాల్వలు లేక ఇబ్బందులు
- వాహనదారులకు అసౌకర్యం
- లష్కర్‌లో ఆర్‌యూబీల తీరు

వర్షం కురిసిన ప్రతిసారి సికింద్రాబాద్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు పునరావృతం అవుతున్నాయి. ఇటువంటి సందర్భాల్లో ఎదురవుతున్న సమస్యలు చక్కదిద్దడం ట్రాఫిక్ పోలీసులకు తలకుమించిన భారంగా పరిణమిస్తోంది. ఈ ప్రాంతంలోని రైల్వే వంతెనలు, కాజ్‌వేలు వర్షం కురిసిన సందర్భాల్లో వరద నీటితో నిండిపోయి జలాశయాలుగా మారుతున్న కారణంగానే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోజంతా నిరాటంకంగా వర్షం కురిసిన ప్రతీ సందర్భంలో వంతెనలు, కల్వర్టుల్లో మోకాలిలోతు వరకు వరద నీరు వచ్చి చేరుతుంది. సమస్యలు ఉత్పన్నం అయిన సందర్భాల్లో వరద నీటిని బయటకు పంపించేందుకు తాత్కాలిక చర్యలతో జీహెచ్‌ఎంసీ అధికారులు సరిపెడుతున్న దరిమిలా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారమార్గం లభించడం లేదు.

అన్ని మార్గాల్లో అదే పరిస్థితి...

అలుగడ్డబావి–రైల్‌నిలయం, చిలకలగూడ–ఒలిఫెంటా ప్రాంతాల్లో ఆరు ఆర్‌యూబీ మార్గాలు ఉన్నాయి. బౌద్ధనగర్ ఆర్ట్స్ కళాశాల–ఓయూ మార్గంలో మరో ఆర్‌యూబీ ఉంది. ఇవి కాకుండా సికింద్రాబాద్ ప్రాంతాన్ని ఆవరించి ఉన్న రైలు మార్గాల్లో పలు కాజ్‌వేలు నెలకొని ఉన్నాయి. అన్ని వంతెనలు, కాజ్‌వే మార్గాలు ప్రధాన రహదారి ఉపరితలానికి లోతుగా ఉండడంతో ఎత్తైన ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి వంతెన మార్గాల్లో చేరుతుంది. ప్రధాన రహదారుల మీదుగా నెలకొని ఉన్న ఈ ఆర్‌యూబీల మార్గాల్లో అకాల వర్షాలు కురిసిన సందర్భాల్లో మోకాలిలోతు వరకు వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ద్విచక్రవాహనాలు, కార్లు, జీపులు వంతెన మార్గాలను దాటుకుని వెళ్లే పరిస్థితి లేకుండా పోతుంది.

జీహెచ్‌ఎంసీకి లేఖ రాస్తాం

వంతెనల మార్గాల్లో వరదనీటి నిల్వలు లేకుండా ఉండేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. ట్రాఫిక్ పోలీసుల సహకారంతో జీహెచ్‌ఎంసీ జంక్షన్ల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పనులు నగరంలో విస్తృతంగా చేపడుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు తీసుకుంటున్న అభివృద్ధి పనుల్లో భాగంగా వంతెన మార్గాల్లో వరదనీటి నిల్వలు లేకుండా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు లేఖలు రాస్తాం.

–ఏ.శ్రీనివాస్, డీసీపీ2 సిటీ (ట్రాఫిక్) పోలీస్



వరదనీటి కాల్వలు లేకపోవడంతో..

అన్ని ఆర్‌యూబీ మార్గాలకు సమీపంలోనే వరద నీటి కాల్వలు ఉన్నాయి. ఆర్‌యూబీల్లో నిలిచిపోయే వరదనీరు వరద కాల్వల్లో చేరడానికి మార్గాలు మాత్రం లేవు. వరదనీరు చేరినపుడల్లా తాత్కాలికంగా తరలించే ఏర్పాట్లు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు తప్ప శాశ్వతంగా సమస్య పరిష్కారం కోసం కాల్వలు నిర్మించడం లేదు. ఆర్‌యూబీ ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవడంతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కారణంతోనే తరచూ ట్రాఫిక్ సమస్యలు తన్నం అవుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అప్రమత్తమై వర్షాకాలం వెళ్లిపోయేలోపు ఆర్‌యూబీ మార్గాలు వరద ముంపుకు గురవకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుని తమ ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జల్లులు.. చిక్కులు

- ఎడతెరిపి లేని జల్లులతో అవస్థలు..
- వర్షాలకు ఛిద్రమైన రహదారులు..
- నాలాల్లోకి పారిశ్రామిక వ్యర్థ జలాలు..

సనత్‌నగర్: నగరం నానుతోంది. ఆకాశానికి చిల్లులు పడ్డాయా? అన్నట్లుగా ఎడతెరిపి లేని వర్షాలతో జన జీవనం స్తంభించింది. ప్రధాన, అంతర్గత రహదారులు అని తేడా లేకుండా వాహనదారులు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుని విలవిల్లాడారు. ఒక వైపు జల్లులు..మరోవైపు ఛిద్రమైన రహదారులు.. ఇంకోవైపు ట్రాఫిక్ గండంతో నగర వాసి బాధలు వర్ణనాతీతం. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బల్కంపేట–ఫతేనగర్ ఫ్లైఓవర్, బేగంపేట–బల్కంపేట లింక్‌రోడ్డులోని ఆర్‌యూబీ వద్ద, బేగంపేట, అమీర్‌పేట, ఎస్సార్‌నగర్ ప్రధాన రహదారులు.. ఇలా పలుచోట్ల వాహన రాకపోకలు నత్తను తలదన్నేలా సాగడంతో వాహనదారుల సహనానికి పరీక్షగా మారింది.

వామ్మో..! బేగంపేట–బల్కంపేట లింక్‌రోడ్డు..

బేగంపేటను బల్కంపేట, సనత్‌నగర్ ప్రాంతాలను లింక్ చేసే లింక్ రోడ్డులో ట్రాఫిక్ నిత్యకృత్యంగా మారింది. బల్కంపేట–బేగంపేట లింక్‌రోడ్డులోని ఆర్‌యూబీ వద్ద ట్రాఫిక్ అంతకంతకూ పెరుగుతుండడంతో ఆ రహదారిలో రావాలంటే వాహనదారులు జంకే పరిస్థితి ఏర్పడింది. బేగంపేట నుంచి సనత్‌నగర్, ఎర్రగడ్డ, బల్కంపేట, ఫతేనగర్ తదితర ప్రాంతాలకు దగ్గరి దారి కావడంతో అందరూ ఈ రోడ్డును ఆశ్రయిస్తుంటారు. కానీ ఇక్కడి ఆర్‌యూబీ కింద ట్రాఫిక్ ఏర్పడుతుండడంతో నరకాన్ని చవిచూస్తున్నారు. ఇక భారీ వర్షం కొట్టిందంటే లోతట్టు ప్రాంతంలో ఉన్న ఆర్‌యూబీ రోడ్డు కాస్తా చెరువును తలపించి మొత్తం రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.


జల్లుల్లోనూ తప్పని రాకపోకలు..


బేగంపేట నాలాలో వ్యర్థ రసాయన జలాలు..

అదే అదేనుగా నాలాల్లోకి కాలుష్య జలాలు..

వర్షం వచ్చిందంటే కొంతమంది పారిశ్రామిక వేత్తలకు పండుగే. ఎందుకంటే ఆయా పరిశ్రమల్లో నిల్వ ఉంచి వ్యర్థ రసాయనాలను వరద మాటున వదిలేసి చేతులు దులుపుకుంటారు. ముఖ్యంగా సనత్‌నగర్, ఫతేనగర్ పారిశ్రామికవాడల్లో రసాయనిక పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయనాలను యథేచ్ఛగా వదులుతుండడంతో బేగంపేట ప్రధాన నాలా కాలుష్యకాసారంగా మారింది.

రోడ్లు ఛిద్రం..

వర్షం ధాటికి రోడ్ల నాణ్యత డొల్లతనం బయటపడుతోంది. రోడ్లు ఛిద్రమై అధికారుల పనితీరును, కాంట్రాక్టర్ల కక్కుర్తిని తేటతెల్లం చేస్తున్నాయి. మోడల్‌కాలనీ, సుందర్‌నగర్, శ్యామలకుంట, సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయి.


ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: కిలో.. రూపాయల్లో.. టమాటా.33, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 18, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 28, కందగడ్డ 28, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు ఉచిత వైద్య శిబిరం

సికింద్రాబాద్: సాధారణ రుగ్మతలతోపాటు, ముక్కు గొంతు చెవి సంబంధిత సమస్యలకు చికిత్సలు అందించడానికి ఈనెల 27న వారాసిగూడలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సికింద్రాబాద్ షెనాయ్ నర్సింగ్ హోం ప్రతినిధి మశ్చేందర్ ముదిరాజ్ తెలిపారు. వారాసిగూడ గొల్లపుల్లయ్య బావి ఫిరదౌసి మసీదు సమీపంలోని న్యూ రోస్ ఫంక్షన్‌హాలులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ అక్షరారెడ్డి, జనరల్ కన్సల్టెంట్ డాక్టర్ రమ్య బృందం వైద్య పరీక్షలు చేస్తారని ఆయన చెప్పారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ఫ్లైఓవర్ కింద ఆమన్ వేదిక స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో కొనసాగుతున్న నైట్ షెల్టర్‌లోని అభాగ్యులకు సనత్‌నగర్‌కు చెందిన శ్రీమాతా సేవా సమితి నిత్యావసర సరుకుల వితరణ చేసింది. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే వైజాగ్‌కు చెందిన కరుణాకర్‌రెడ్డి, చందానగర్‌కు చెందిన మొరం సురేష్‌కుమార్, శ్రీజ మోతుకూరి, బోయిన్‌పల్లికి చెందిన వనం లక్ష్మణరావు–కళ్యాణి దంపతులు, శ్రీనాథ్‌లు ముందుకువచ్చి ఆయా నిత్యావసర వస్తువులను అందించగా శ్రీమాతా సేవా సమితి అధ్యక్షురాలు కుసుమ విజయ శనివారం వారికి అందజేశారు. సభ్యులు రాధిక కమల, గోనె శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రైలులో యువతితో అసభ్య ప్రవర్తన

అమీర్‌పేట: మెట్రో రైలులో ప్రయాణిస్తున్న ఓ యువతి తో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. న్యూ బోయిన్‌పల్లికి చెందిన యువతి ఈ నెల 24న రాత్రి మెట్రో రైలులో వెళుతుండగా అమీర్‌పేట వద్ద అపరిచిత వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. నిలదీసిన యువతిని అతను చెంపదెబ్బ కొట్టాడు. దీంతో బాధితురాలు అతన్ని వీడియో తీయగా నిందితుడుపరారయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఆరోగ్య సంరక్షణకు ఆధునిక పద్ధతులు అవసరం

గాంధీఆస్పత్రి: దివ్యాంగులకు సమగ్రమైన ఆరోగ్య సంరక్షణ అందించేందుకు అత్యాధునిక పద్ధతులు అవలంభిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ కోటేశ్వరమ్మలు సూచించారు. 'వికలాంగతకు అతీతమైన సామర్థ్యాలు, స్థిరమైన,సమగ్ర రోడ్ మ్యాప్' అంశంపై సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ సెమినార్ హాలులో శనివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. దివ్యాంగులకు వైద్యసేవలు అందించేందుకు వైద్యులకు వృత్తిపరమైన శిక్షణ అవసరమన్నారు. సేవా భావంతో ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కమ్యూనిటీమెడిసిన్ డిపార్ట్‌మెంట్ వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో గాంధీ వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ రాజారామ్, ప్రొఫెసర్ రవిశేఖర్‌రావు, ఎస్‌పీఎం వైద్యులు అస్మా, మౌనిక, సుస్మిత, రజిత, ప్రఫుల్, ఎస్‌ఓ రాజ్‌కుమార్, ఎంపీహెచ్‌ఓ వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.


సదస్సు ప్రారంభిస్తున్న గాంధీ ప్రిన్సిపాల్ ఇందిర

రాష్ట్రపతి నిలయంలో కార్గిల్ విజయ్ దివస్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బొల్లారం: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కార్గిల్ విజయ్ దివస్ – 2025 వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన భారత సైనికులను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ వేడుకల్లో 94 స్కూళ్లు, కళాశాలల నుంచి సుమారు 3,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా బ్రిగేడియర్ జోస్ అబ్రహాం, మెజర్ (రిటైర్డ్) ఎస్.పీ.ఎస్. ఓబెరాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ దేశభక్తి నిప్రతిబింబించేలా ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం దేశభక్తి అంశాలపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీ, రంగోలీ ప్రదర్శన, ఓపెన్ మైక్ సెషన్లను నిర్వహించారు. రాష్ట్రపతి నిలయం మేనేజర్ డా. కె. రజనీ ప్రియా తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమర వీరుడికి నివాళి

బొల్లారం: కార్గిల్ విజయ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 8వ వార్డ్ బొల్లారంలోని కార్గిల్ వీరుడు రామచందర్ విగ్రహానికి బోర్డ్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన రామచందర్ వీరత్వం, ధైర్యం, దేశభక్తి మనందరికీ స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. రామచందర్ తల్లి, సోదరుడు రవి కిరణ్ పాల్గొన్నారు.



'కిమ్స్–సన్‌షైన్'లో అధునాతన భుజం మార్పిడి విజయవంతం


వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్..

సనత్‌నగర్: బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్ వైద్యులు అధునాతన భుజం మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేసినట్లు ఆస్పత్రి షోల్డర్ సర్జరీ డైరెక్టర్ డాక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. దక్షిణాఫ్రికాకు చెందిన 27 సంవత్సరాల యువకుడికి ప్రమాదంలో భుజం ఎముక విరిగిపోయి, భుజం కదపలేని పరిస్థితిలో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన యువకుడికి డోనర్ ఎముక గ్రాఫ్ట్‌ను ఉపయోగించి ఈ శస్త్ర చికిత్సను నిర్వహించినట్లు తెలిపారు. సర్టిఫైడ్‌బోన్ బ్యాంక్ ద్వారా పొందిన డోనర్ ఎముక టిష్యూ ద్వారా దెబ్బతిన్న భాగాన్ని పునఃనిర్మించారు. నాలుగు గంటల పాటు జరిగిన శస్త్ర చికిత్స అనంతరం రోగి పూర్తిగా కోలుకున్నాడని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్–1 అంతర్ ప్రాంత బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. మెన్స్ సింగిల్స్‌లో పింటో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ద్వితీయ డి.హరికిశోర్, తృతీయ హిమాన్షు శ్రీనివాస్, నాలుగో బహుమతి మనీశ్ అందుకున్నారు. మెన్స్ డబుల్స్‌లో మనీశ్, సాంకేత్ ప్రథమ, అఫ్రిట్, హరికిశోర్ ద్వితీయ, తృతీయ చేతన్ చౌహాన్, సుమిత్‌కుమార్, నాలుగో బహుమతిని హిమాన్షు శ్రీనివాస్, పింటో దక్కించుకున్నారు. కాగా ఉమెన్స్ సింగిల్స్‌లో కే పింకి మొదటి బహుమతి, పౌర్ణమి ద్వితీయ, నిషి రాథోర్, హిమానీ కుమారి తృతీయ, నాలుగో బహుమతి దక్కించుకున్నారు.

మైమరిపించిన నృత్యం



సనత్‌నగర్: సింగపూర్ ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీలో గురువు నిషితా యాబాజీ శిష్యరికంలో కూచిపూడిలో శిక్షణ పొందిన ప్రియాంక జ్యోషుల అరంగేట్రం శనివారం సాయంత్రం అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ప్రతి అంశంలోనూ హావభావాలు పలికిస్తూ సాగిన నృత్య ప్రదర్శన ప్రియాంక పొందిన శిక్షణలోని నైపుణ్యాలకు అద్దంపట్టాయి. కార్యక్రమంలో వేదాంతం రాధేశ్యాం, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద

బొల్లారం: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 8వ వార్డు బొల్లారం ఆదర్శ్‌నగర్‌లో రూ.12.5 లక్షల ఖర్చుతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో రహదారుల అభివృద్ధి పనులు కూడా చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ప్రవీణ్, ఎం.ఎస్. కిరణ్, జె.వి. నర్సింగ్ రావు, ధనుంజయ్ చారి, ప్రవీణ్ యాదవ్, వినోద్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస విశేష పూజలు



సనత్‌నగర్: శ్రావణ మాసం మొదటి శనివారం పురస్కరించు కుని సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామిని ప్రత్యేక అలంకరణ దర్శనం జరిగింది. స్వామివారిని కనకాంబర పూలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈఓ సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో శ్రావణ మాస విశేష పూజలు కొనసాగుతున్నాయి.

పవర్‌బోర్‌కు మరమ్మతులు

అడ్డగుట్ట: బి సెక్షన్‌లో పాడైపోయిన పవర్ బోర్‌కు శనివారం బీజేపీ నాయకులు జలమండలి సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో పవర్ బోర్లు సరిగ్గా పని చేయడం లేదన్నారు. దీంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందువల్ల పని చేయని పవర్‌బోర్లను గుర్తించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని తెలిపారు. నాయకులు సాయన రాజు, హంసరాజు, ఉదయ్, చందర్, మహేందర్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో వసతులు, వైద్యసేవలు భేష్


గాంధీ ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, వసతులు, వైద్యసేవలు బాగున్నాయని తెలంగాణ వైద్యవిద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) మేనేజింగ్ డైరక్టర్ ఫణీంద్ర కితాబు ఇచ్చారు. గాంధీ ఆస్పత్రిలో శనివారం ఆయన ఆకస్మికతనిఖీలు చేపట్టారు. అవుట్ పేషెంట్ విభాగం, ఫార్మసీ కౌంటర్, రేడియాలజీ, ఏఎంసీ, డైట్, జెరియాట్రిక్ వార్డు, ఫార్మసీ డిపార్ట్‌మెంట్, సీసీ కెమెరాల సర్వేలెన్స్ సెంటర్ తదితర విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాలు, వార్డుల్లో అందిస్తున్న సేవలు, సదుపాయాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజీఎంఎస్ఐడీసీ జనరల్ మేనేజర్ రుక్మారెడ్డి, ఈడీ కౌటిల్య, గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సందడి చేసిన విద్యార్థినులు



సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో 'డిస్కో దీవానే' పేరితో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు సినీ పరిశ్రమకు చెందిన మోడళ్లు, నటీమణులు డెబోరా డోరిస్ ఫెల్, మోనికా ఆర్యరెడ్డి హాజరయ్యారు. ర్యాంప్ వాక్, టాలెంట్ రౌండ్, ప్రశ్నలు–సమాధానాల రౌండ్, వారు వేదికపై ఉన్న తీరుతెన్నులు, ధైర్యం, ఆకర్షణీయత, ప్రతిభ, తెలివితేటలు, నిజాయితీ ఆధారంగా తీర్పు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమా జోసఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి


సంజీవపురం కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. శనివారం జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులతో కలిసి డివిజన్‌లోని పలు బస్తీల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, మ్యాన్‌హోళ్లను పరిశీలించారు. వెంటనే తగిన మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఏఈ లావణ్య, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, రాజేశ్వర్, ఆంజనేయులు, కుమార్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఎస్సార్టీ కాలనీలో ఇద్దరికి డెంగీ

సనత్‌నగర్: ఎస్సార్టీ కాలనీలో ఇద్దరికి డెంగ్యూ పాజిటివ్ రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వైద్య, ఆరోగ్య శాఖ, జీహెచ్‌ఎంసీ సంయుక్తంగా ఆ ప్రాంతంలో పర్యటించి శానిటేషన్ చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటికే డెంగ్యూ పాజిటివ్‌గా తేలిన ఇంటి చుట్టుపక్కల దాదాపు 100 ఇళ్ల నివాసితుల నుంచి బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపారు. అయితే డెంగ్యూ కేసు నమోదు కావడంతో స్థానికంగా తీవ్ర ఆందోళన రేకెత్తుతోంది.

కుంగిన రోడ్డు.. వాహనదారుల ఇబ్బందులు

అడ్డగుట్ట: తుకారాంగేట్ న్యూ బ్రిడ్జ్ నుంచి రైల్వే హాస్పిటల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం రోడ్డు కుంగిపోయింది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సఫీల్‌గూడ, మల్కాజ్‌గిరి, లాలాపేట, ప్రశాంత్‌నగర్ నుంచి నిత్యం అనేక బస్సులతో పాటు, కార్లు, బైక్‌లు కూడా ఈ మార్గాన రాకపోకలు సాగిస్తుంటాయి. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకముందే అధికారులు స్పందించిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

